క్లుప్తంగా

నేటి నుంచి మౌలాలిలో కాంగ్రెస్ పాదయాత్ర

మౌలాలి: మౌలాలి డివిజన్ దర్గా చిల్లా నుంచి మంగళవారం ఉదయం డీసీసీ అధ్యక్షులు, మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్ నేతృత్వంలో హాత్ సే హాత్ జోడో యాత్ర కొనసాగుతుందని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంశీ ముదిరాజ్ తెలిపారు. యాత్రలో స్థానిక కాంగ్రెస్ నాయలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కాలనీవాసులు

బోడుప్పల్: వక్ఫ్ బోర్డు బాధితుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 16వ రోజుకు చేరుకున్నాయి. బోడుప్పల్ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్, జేఏసీ కో చైర్మన్ కొత్త కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, కుంభం కిరణ్ కుమార్‌రెడ్డి, సంఘీభావం తెలిపారు. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగించాలన్నారు. దీక్షలో రామకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మిరియాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చర్లపల్లి, ఐజీ కాలనీకి చెందిన కృష్ణను సోమవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడికి ఆర్థికసాయం అందజేసిన ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ముత్యాలు, నజీర్, వెంకట్‌రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అష్టలక్ష్మీ యాగం



కార్యక్రమంలో పాల్గొన్న దేవనాథ్ జీయర్‌స్వామి

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, ఫేస్–1 గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న 21వ అష్టలక్ష్మీయాగం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. చిన్నజీయర్ స్వామి ఆశీస్సులతో పీతాంబరం రఘునాథచార్యుల స్వామి ఆధ్వర్యంలో యాగాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగిన పూజా కార్యక్రమాల్లో దేవనాథ్ జీయర్‌స్వామి పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ ప్రభుదాస్ తదితరులను స్వామీజీ ఘనంగా సత్కరించారు.

పది పాజిటివ్ కేసులు నమోదు

మల్కాజిగిరి: మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సోమవారం 46 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించారు.10 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అల్వాల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ శిక్షణా సంస్థ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. సోమవారం గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీ కానాజీగూడలోని నారాయణ విద్యా భవన్‌లో బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, టీటీఐ స్టాఫ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా యువత సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావద్దన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో బేగంపేట్ టీటీఐ స్టాఫ్ ఎస్‌ఐ సీహెచ్ జ్యోతి, పాఠశాల కరస్పాండెంట్ పద్మనాభం, ప్రిన్సిపాల్ కే.వి. రాఘవాచార్యులు, విద్యార్థులు తదితరులున్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తాం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్

- 133 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం
- విద్యాశాఖ మంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అమయ్‌కుమార్
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో విద్యార్థుల కోసం కంట్రోల్ రూమ్ (040-27118584) ఏర్పాటు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఇంటర్మీడియట్ పరీక్షలు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించేందుకు పక్కాగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు 133 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయటంతో పాటు నిరంతరంగా విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుద్ధ్యం, ఫర్నీచర్ వంటి అన్నీ వసతులను కల్పించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయటంతో పాటు జిరాక్స్ సెంటర్లు మూసివేస్తామన్నారు. పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని, ఇందు కోసం ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్లను నియమించినట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో జనరల్ 62,342 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులో 1,452 మంది విద్యార్థులతో కలిపి మొత్తంగా 63,794 మంది పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్లో 54,146 మంది, ఒకేషన్ కోర్సులో 995 విద్యార్థులతో కలిపి మొత్తంగా 55,141 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు 1,18,935 మంది ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో ముందస్తుగా సమావేశాలు నిర్వహించామని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోలేని విద్యార్థులు నేరుగా ఇంటర్మీడియట్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల కోసం జిల్లా స్థాయిలో కంట్రోల్ రూం (040-27118584) ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కిషన్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... ఇంటర్ విద్యార్థుల కోసం రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్ (నంబర్: 040-24601010) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే, టెలీమానస్ నంబర్ 14416 ద్వారా ఉచిత కౌన్సెలింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆమె ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రితో పాటు విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ తదితరులు ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలి

మల్లాపూర్: సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు దృష్టి సారించాలని సీసీఎంబీ శాస్త్రవేత్త డాక్టర్ విజయ భాస్కర్ అన్నారు. సోమవారం ఆయన శక్తి సాయి నగర్ కాలనీలోని శ్రీ విద్యానికేతన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనుగుణంగా విద్యార్థులు సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్‌లను తిలకించి అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ కేజీ రెడ్డి, కరస్పాండెంట్ ఏకాంబరనాథ్, ధనుంజయ్ రావు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న సీసీఎంబీ శాస్త్రవేత్త విజయ భాస్కర్

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



పవర్ బోరు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మేకల సునీత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ మేకల సునీతయాదవ్ అన్నారు. సోమవారం ఆమె ఇందిరానెహ్రూనగర్‌లో పవర్‌బోరు మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

మల్లాపూర్: నాచారం న్యూ రాఘవేంద్రనగర్ కాలనీలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాయ వార్షికోత్సవాలు సోమవారం చండీ హోమంతో ముగిశాయి. ఈ సందర్భంగా మండపారాధన పూజ, అభిషేకం, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మేకల ముత్యంరెడ్డి, సీఎస్.బ్రదర్స్ మల్లేష్, రాంరెడ్డి, సత్తయ్య యాదవ్, కేశవరావు, ఉప్పలయ్య, డాక్టర్ రమేష్, సత్యనారయణ గుప్తా, చక్రపాణి, ఆలయ ప్రధాన అర్చకులు రవికుమార్ శర్మ పాల్గొన్నారు.

వైద్యులు పనితీరును మెరుగుపరుచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

సాక్షి,మేడ్చల్ జిల్లా: బస్తీ దవాఖానాల్లో వైద్యాధికారులు, వైద్యులు పనితీరును మరింతగా మెరుగుపరుచుకుని మంచి పేరు తెచ్చుకునేలా ప్రజలకు వైద్య సేవలు అందించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ కోరారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో సోమవారం జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖాధికారులు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానా వైద్యులతో ఆయన జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని డయాగ్నోస్టిక్స్ సెంటర్ల సేవలు, టెలీ కాన్సులేషన్, అవుట్ పేషెంట్ మాడ్యూల్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల అందజేత వంటి విషయాలను డీఎంహెచ్ఓ అడిగి తెలుసుకున్నారు. కొత్త వైరస్‌లు, అంటువ్యాధులు ప్రబల కుండా వైద్యాధికారులు అహర్నిశలు కష్టపడుతున్నారని కొనియాడారు. కోవిడ్ నేపథ్యంలో ప్రజలు తమవంతు బాధ్యతగా వ్యాక్సిన్ వేయించుకోవడంతో పాటు సామాజిక దూరం పాటించి, తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు. క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవాలని, శానిటైజర్లు వాడటం మరిచి పోవద్దన్నారు. సీఆర్‌పీలో శిక్షణ పొందేందుకు వైద్య సిబ్బందిని గుర్తించడంతో పాటు కార్యాచరణ ప్రణాళిక, శిక్షణా షెడ్యూల్‌ను ఖరారు చేయాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి మాస్టర్ ట్రైనర్‌కు సంబంధించి ఒక్కో బ్యాచ్‌కి 20 చొప్పున 3 బ్యాచుల్లో నిత్యం 60 మంది వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని, దీనికి ప్రోగ్రామ్ ఆఫీసర్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ టీమ్‌కు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలని, ప్రతీ ఆరోగ్య కేంద్రం వద్ద యాంటీ రేబిస్ వ్యాక్సిన్, యాంటీ స్నేక్ వీనమ్ స్టాక్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రజారోగ్య కార్యక్రమాలపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ శ్రీనివాస్ హెచ్చరించారు.

హర్షవర్ధన్ రెడ్డి గెలుపు ఖాయం



మాట్లాడుతున్న పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థి హర్షవర్ధన్ రెడ్డి గెలుపు ఖాయమని ఉప్పల్ సర్కిల్ ఏ– బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన రామంతాపూర్, ఉప్పల్ తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీల ప్రజావ్యతిరేక పాలనపై ఉపాధ్యాయులు విసుగుచెందారన్నారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి హర్షవర్ధన్ రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తాడని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తోఫిక్, సుర్వి మురళి గౌడ్, కంది శ్రవణ్ రెడ్డి, ఆకారపు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా లయన్స్ క్లబ్



ఫ్రీజర్‌ను అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

అల్వాల్: పేదలకు లయన్స్ క్లబ్ ఎల్లవేళలా అండగా ఉంటుందని లయన్స్ క్లబ్ హైదరాబాద్ మైత్రి ప్రతినిధులు అమర్నాథ్‌రావు, జే శ్రీనివాసరావు, గోపి అన్నారు. సోమవారం లోతుకుంటలోని అల్వాల్ వైకుంఠ ధామానికి ఫ్రీజర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మైత్రి సేవలను మరింత విస్తరిస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్, రమణారావు, భాస్కర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వైకుంఠధామం సూపర్‌వైజర్ రవి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

ఆలయాల అభివృద్ధికి కృషి

బోడుప్పల్: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి చామకూర మల్లారెడ్డి, జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. సోమవారం చెంగిచర్లలోని శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీరామాలయ, శ్రీ శివాలయ, నవగ్రహ ఆలయ ప్రతిష్ఠామహోత్సవాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, నేతలు నక్క ప్రభాకర్‌గౌడ్, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేయర్లు సామల బుచ్చిరెడ్డి, జక్క వెంకట్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ఆరాధనలు, ప్రాణ ప్రతిష్ఠాహోమాలు, మహా పూర్ణాహుతి, మహా కుంభ సంప్రోక్షణ, ప్రాణ ప్రతిష్ఠ, ప్రథమ ఆరాధన, దృష్టి కుంభ దర్శనం, సర్వదర్శనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిరవిగౌడ్, కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి, నేతలు రంగ బ్రహ్మన్నగౌడ్, కొత్త ప్రభాకర్‌గౌడ్, కొత్త విక్రమ్‌గౌడ్, కొత్త సుశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



మల్కాజిగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



మల్లాపూర్‌లో..

మల్లాపూర్: ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను సోమవారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పల్లా కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసుగౌడ్, ఎస్వీ శివకుమార్, తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, కుంటి కృష్ణ,పీఆర్.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నాచారంలో...

నాచారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను నాచారం డివిజన్ అధ్యక్షులు మేకల ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాచారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో..

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, శాంతిరెడ్డి, సునీతాయాదవ్, సబితా కిషోర్, నాయకులు గుండా నిరంజన్, పిట్టల శ్రీనివాస్, రాముయాదవ్, సత్యమూర్తి, నర్సింగరావు,రాజు, కన్న తదితరులు పాల్గొన్నారు.

మొల్లమాంబకు నివాళి

మల్లాపూర్: రామాయణాన్ని సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో తెలుగులోకి అనువదించిన ఆతుకూరి మొల్ల మాంబ జయంతి వేడుకలు సోమవారం నాచారంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవయిత్రి చిత్రటానికి బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాడూరి శ్రీనివాస్, సాయిజెన్‌శేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్తీక్ కుమార్, కృష్ణ. నరసింహ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మొల్లమాంబకు నివాళులర్పిస్తున్న తాడూరి శ్రీనివాస్, సాయిజెన్‌శేఖర్

చెత్తకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు..



చిన్న చెరువు ప్రాంతంలో వెలువడుతున్న పొగ

రామంతాపూర్: రామంతాపూర్ చిన్న చెరువు ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను ప్రతిరోజు జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రపరిచి ఆ చెత్తను వాహనంలో తరలించకుండా చెరువు వద్దనే నిప్పు పెడుతున్నారు. ఈ కారణంగా వెలువడే దట్టమైన పొగతో పరిసరప్రాంతాల్లోని నేతాజీనగర్, ఇందిరానగర్, ఆనంద్‌నగర్, భరత్‌నగర్, శాంతినగర్, తదితర బస్తీల, కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, ఉప్పల్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు జోక్యం చేసుకుని చెత్తను వాహనాల్లో తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

రామంతాపూర్: ఉప్పల్, మల్కాజిగిరి డివిజన్ల పరిధిలో సోమవారం మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పెద్ద సంఖ్యలో టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్‌లో పలువురు ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ బలపర్చిన అభ్యర్థి ఏవీఎన్.రెడ్డికి మద్దతుగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ పోలింగ్ స్లిప్పులు అందజేశారు.

550 కి 437 ఓట్లు

కుషాయిగూడ: కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 550 ఓట్లకు గాను 437 మంది టీచర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్వతంత్ర అభ్యర్థి కాటేపల్లి జనార్దన్‌రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. జాయింట్ సీపీ సత్యనారాయణ, డీసీపీ జానకీ ధరావత్, ఏసీపీ వెంకట్‌రెడ్డి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ

మల్కాజిగిరిలో..

మల్కాజిగిరిలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 511 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 435 మంది ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. అల్వాల్ మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.



పోలింగ్ కేంద్రం వద్ద మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు